సంక్షిప్త వార్తలు

• దళిత సర్పంచ్‌ను చెట్టుకు కట్టేసి చిత్రహింసలు

మోరెనా, జూన్ 7: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దళితులకు రక్షణ లేకుండా పోతున్నది. దళిత సర్పంచును కొందరు వ్యక్తులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. మోరెనా జిల్లాలోని కౌతర్‌కలాన్ పంచాయతీ సర్పంచ్‌ను వెంటనే పదవి విడిచిపెట్టి ఊరు నుంచి వెళ్లిపోవాలని గత రెండేళ్లుగా కొందరు వేధిస్తున్నారు. దానికి అతడు ఒప్పుకోకపోవడంతో అతడిని చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెట్టారు. బాధితుడు గురువారం పోర్సా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గూండాల వేధింపులు తాళలేక సర్పంచ్ గ్రామాన్ని విడిచిపెట్టారని స్థానికులు తెలిపారు.

• హౌతీ రెబల్స్ నిర్బంధంలో ఐరాస ఉద్యోగులు

దుబాయ్: ఐక్యరాజ్యసమితికి చెందిన వివిధ ఏజెన్సీల సిబ్బందిని హౌతీ రెబల్స్ నిర్బంధించారు. వీరి నిర్బంధంలో 9 మంది యెమెన్ ఉద్యోగులు, ఇతరులు ఉన్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు వైమానిక దాడులు చేస్తుండటంతో హౌతీ రెబల్స్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీరి నిర్బంధంలో ఉన్నవారిలో సహాయక బృందాల సభ్యులు కూడా ఉండి ఉండవచ్చునని తెలిపారు.

• పాక్ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ ప్రస్తావన

ఇస్లామాబాద్: భారత దేశంలో ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చారని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆ దేశ సుప్రీంకోర్టుకు చెప్పారు. ఫిబ్రవరి 8న జరిగిన పాక్ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా నిరోధించేందుకు ఐదు రోజుల్లోనే తనను దోషిగా తీర్పు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 ఏప్రిల్‌లో తాను పదవిని కోల్పోయానని, అప్పటి నుంచి తనను విపరీతంగా వేధిస్తున్నారన్నారు. తనను అప్రకటిత మార్షల్ లా క్రింద అణగదొక్కుతున్నారని వాపోయారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్‌ను నేషనల్ అకౌంటబిలిటీ ఆర్డినెన్స్‌కు సవరణలకు సంబంధించిన కేసులో విచారణ కోసం పాక్ సుప్రీంకోర్టులో గురువారం హాజరుపరిచారు.

• జయంత్‌కు బ్యాక్ సీట్‌పై వివాదం

న్యూఢిల్లీ: ఎన్డీయే సమావేశంలో ఆర్‌ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరిని బీజేపీ అవమానించిందని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోదీని ఎన్నుకున్న ఈ సమావేశంలో టీడీపీ, జేడీయూ, తదితర పార్టీల నేతలను వేదికపై మోదీ పక్కనే కూర్చోబెట్టారని, జయంత్‌ను మాత్రం ఇతర ఎంపీలతోపాటు కూర్చోబెట్టారని మండిపడ్డాయి. మహా రైతు నేత చౌదరి చరణ్ సింగ్ మనుమడిని బీజేపీ అవమానించిందని వ్యాఖ్యానించాయి. రైతుల గౌరవం పట్ల జయంత్‌కు నిబద్ధత ఉంటే, ఆత్మాభిమానం ఉంటే, ఆయన ఎన్డీయేను వదిలిపెట్టాలని, తిరిగి ఇండియా కూటమిలోకి రావాలని పిలుపునిచ్చాయి. దీనిపై ఆర్‌ఎల్‌డీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ స్పందిస్తూ, తమను ఇండియా కూటమి ఎప్పుడు గౌరవించిందని ప్రశ్నించారు.

• 'ఎన్డీయే అంటే నితీశ్-నాయుడు డిపెండెంట్ అలయన్స్'

న్యూఢిల్లీ: ఎన్డీయే అంటే 'నితీశ్-నాయుడు డిపెండెంట్ అలయన్స్' ('నితీశ్-నాయుడుపై ఆధారపడ్డ కూటమి) అంటూ కాంగ్రెస్ కొత్త నిర్వచనం ఇచ్చింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాని బీజేపీ ఎన్డీయే పక్షాలైన టీడీపీ, జేడీయూపై ఆధారపడే పరిస్థితి తలెత్తింది. శుక్రవారం జరిగిన కూటమి సమావేశంలో మోదీ చేసిన గంటసేపు ప్రసంగంలో ఎన్డీయే పేరును తలచినంతగా, గత పదేండ్ల పాలనలో ఎన్నడూ కనీసం ప్రస్తావించిన పాపాన పోలేదని కాంగ్రెస్ విమర్శించింది. కాగా, 10 ఏండ్ల పాలనలో నిత్యం రాజ్యాంగాన్ని ఆడిపోసుకున్న మోదీ శుక్రవారం దానిని కళ్లకు అద్దుకోవడం 'డ్రామా' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

నీట్‌గా అక్రమాలు!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి.

మార్కులు కలపడం వల్లే టాపర్లు పెరిగారు: ఎన్‌టీఏ

ఎక్కువ మందికి ఇలా అధిక మార్కులు రావడానికి, టాపర్లు కావడానికి ఫిజిక్స్‌లో వచ్చిన ఒక ప్రశ్ననే కారణమని పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) చెప్తున్నది. ఈ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నకు.. ఎన్‌సీఈఆర్‌టీ కొత్త టెస్టుబుక్ ప్రకారం ఒక సమాధానం, పాత టెస్టుబుక్ ప్రకారం మరో సమాధానం సరైనవి. మొదట ఒక్క సమాధానానికే ఎన్‌టీఏ మార్కులు ఇస్తూ కీ విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు రావడంతో రెండు సరైన సమాధానాల్లో ఏది రాసినా మార్కులు వేసినట్టు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ నిర్ణయంతో 44 మంది అభ్యర్థులకు మార్కులు 715 నుంచి 720కి పెరిగినట్టు వివరించింది. ఈసారి పరీక్షా పత్రం సులువుగా ఉండటం, గత ఏడాది కంటే దాదాపుగా

నీట్ అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు చేసిన ట్వీట్స్

మూడు లక్షల మంది ఎక్కువగా పరీక్ష రాయడం కూడా టాపర్లు పెరగడానికి కారణమని పేర్కొన్నది.

కోర్టుకు చేరిన వివాదం

నీట్ ఫలితాల విషయంలో వివాదం కోర్టుకు చేరింది. నీట్ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గ్రేస్ మార్కుల కేటాయింపులో తప్పులు జరిగాయని, ఫలితంగా అభ్యర్థులు అడ్మిషన్లు పొందడంలో నష్టపోతారని న్యాయవాది తన్మయ్ ఛటోపాధ్యాయ్ కోర్టుకు తెలిపారు. దీంతో ఫలితాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్‌టీఏను జస్టిస్ కౌశిక్ చంద్ర ఆదేశించారు. మరోవైపు రెండు జవాబులు ఉన్న ప్రశ్నకు సమాధానం రాయకుండా వదిలేసిన వారికి కూడా మార్కులు కలపాలని కోరుతూ ఓ అభ్యర్థి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండు జవాబులు సరైనవి కావడంతో ఏ జవాబును రాయకుండా వదిలేశామని, నీట్‌లో ఒక్క మార్కుతోనూ ర్యాంకులో భారీ తేడా వస్తుంది కాబట్టి మార్కులు కలపాలని అభ్యర్థి కోరారు. ఈ పిటిషన్‌పై అభిప్రాయం తెలపాల్సిందిగా ఎన్‌టీఏను వెకేషన్ బెంచ్ జడ్జి జస్టిస్ డీకే శర్మ ఆదేశించారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో జూదం ఆడుతున్నారని, కచ్చితంగా దీనిపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ మరో నేత జైరామ్ రమేశ్ కోరారు. నీట్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ హర్యానాలోని జింద్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. హర్యానాలో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి టాప్ ర్యాంకులు వచ్చాయని వీరు పేర్కొన్నారు. నీట్ పరీక్ష విధానంలో ఎవరికీ 718, 719 మార్కులు వచ్చే అవకాశం లేదని, కానీ ఫలితాల్లో ఇలా వచ్చాయని తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట్ 2024లో భారీ అవినీతి: బీఆర్‌ఎస్వీ

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో నీట్ 2024 పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారని బీఆర్‌ఎస్వీ ఓయూ నాయకుడు నాగేందర్ కోదాటి ఆరోపించారు. కేంద్రప్రభుత్వం, ఎన్‌టీఏలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 67 మందికి 720 మార్కులు వచ్చాయని గుర్తు చేశారు. ఇది సాధ్యంకానిదని మేధావులు, వైద్యులు ఘంటాపథంగా చెబుతున్నారన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720 మార్కులు రావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 180 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కుల చొప్పున మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహించగా, 719, 718 మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పెద్ద పెద్ద నగరాల్లో లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నప్పటికీ, ఎన్‌టీఏ అవినీతితో అదంతా వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవినీతి వెనుక పెద్దపెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్‌టీఏ డైరెక్టర్‌ను తక్షణమే అరెస్టు చేసి, సీబీఐకి కేసు అప్పగించాలని డిమాండ్ చేశారు. పరీక్షను తిరిగి నిర్వహించాలని, అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

• అంతరిక్షంలో సునీత.. ఆనందంతో కేరింత

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆనందంతో డ్యాన్స్ చేశారు. బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారా ఐఎస్ఎస్‌కు చేరుకున్న విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌కు అక్కడి వారు గంట కొట్టి స్వాగతం పలికారు. అక్కడ ఉన్న ఇతర వ్యోమగాములను సునీత ఆలింగనం చేసుకున్నారు.

చక్కెర వ్యాధికి చుక్కల మందు

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించిన పరిశోధనల్లో విజయవంతం అయ్యిందని, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలోకి వచ్చాయని వివరించారు. ప్రస్తుతం ఈ డ్రాప్స్ పేటెంట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశామని, త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల చేసే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రష్యాలో నదిలో పడి నలుగురు భారతీయ విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రష్యాలో మెడిసిన్ చదువుతున్న నలుగురు భారతీయ విద్యార్థులు ఓ నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థిని రక్షించారు. ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతున్నది. మన దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యాలోని వెలికీ నోవ్‌గోరోడ్‌లో ఉన్న యారోస్లావ్ ది వైజ్ నోవ్‌గోరోడ్ స్టేట్ యూనివర్సిటీలో వీరు చదువుతున్నారు. వీరు మహారాష్ట్రలోని జలగావ్‌కు చెందిన వారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇండియన్ కాన్సులేట్ వెంటనే స్పందించి, స్థానిక అధికారులతో, విశ్వవిద్యాలయంతో సంప్రదిస్తూ, సహాయం అందిస్తున్నది. అదే విధంగా మహారాష్ట్రలోని జలగావ్‌లో ఉన్న ఈ విద్యార్థుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులతో కూడా మాట్లాడుతున్నది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

11వ తరగతి ఫెయిల్.. ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్

మధ్యప్రదేశ్‌లో రైతు కుమార్తె ఘనత

ఇండోర్: ఆమె ఒక రైతు కుమార్తె.. 11వ తరగతిలో ఫెయిలయ్యింది. తన వైఫల్యాన్నే విజయంగా మార్చుకుంది. ఇప్పటికే ప్రభుత్వ శాఖలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నా తృప్తి పడలేదు. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్సీ) పరీక్షలో ఆమె ఆరో ర్యాంకు సాధించడంతో త్వరలో డిప్యూటీ కలెక్టర్ కానుంది. ప్రియా యాదవ్‌కు చెందిన ఈ కథ ఎందరికో ఆదర్శం. పట్టుదల, కృషితో ప్రణాళికాబద్ధంగా చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా అవలీలగా ఛేదించవచ్చునని ఆమె ఉదంతం తెలియజేస్తున్నది. 10వ తరగతిలో తాను క్లాస్ టాపర్‌నని, అయితే బంధువుల ఒత్తిడి మేరకు తనకు ఇష్టం లేకున్నా 11వ తరగతిలో సైన్స్ సబ్జెక్టు చదివి ఫిజిక్స్‌లో ఫెయిల్ అయినట్టు 27 ఏండ్ల ప్రియా యాదవ్ తెలిపింది.

ఓడిన 'ఇండియా' అభ్యర్థులకు సన్మానాలు: అఖిలేశ్

లక్నో: లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన 'ఇండియా' అభ్యర్థులను 'సమ్మాన్‌సద్' బిరుదుతో సత్కరిస్తామని సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ చెప్పారు. బీజేపీ పాల్పడిన పాలన పరమైన స్కామ్‌ల కారణంగా గెలవలేకపోయిన తమ అభ్యర్థులంతా వాస్తవంగా విజేతలేనని తాము నమ్ముతున్నామన్నారు.

పుట్టిన రోజు ఒక్కటే.. ఇప్పుడు మరణించిన రోజు కూడా..

ట్రెక్కింగ్‌లో మృతి చెందిన దంపతుల విషాదం

బెంగళూరు: ఉత్తరాఖండ్‌లోని హిమాలయ పర్వతాల్లోని సహస్త్రతల్ సరస్సు వద్దకు ట్రెక్కింగ్‌కు వెళ్లి మరణించిన కర్ణాటకకు చెందిన భార్యాభర్తలకు సంబంధించిన విషయం అందరినీ కలచివేస్తున్నది. ట్రెక్కింగ్‌కు వెళ్లిన బృందంలో ప్రతికూల వాతావరణంలో చిక్కుకుని 9 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో కర్ణాటక హుబ్బళికి చెందిన భార్యాభర్తలు వినాయక్ ముంగురవాడీ, సుజాత ముంగురవాడీ కూడా ఉన్నారు. వీరిద్దరూ 1994లో హుబ్బళిలోని బీవీబీ కాలేజీలో ఇంజనీరింగ్ చదివారు. ఇద్దరి పుట్టిన రోజు ఒక్కటే. ఇప్పుడు మరణించిన రోజు కూడా ఒక్కటే కావడం విషాదం. 1996 నుంచి వీరు బెంగళూరులో ఉంటున్నారు. ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వినాయక్ స్నేహలోక అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా గత 16 ఏండ్లుగా సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో అనేకమందికి సహాయం చేశారు. ప్రతి ఏడాది వినాయక్ ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు. ఈ ఏడాది భార్యతో వెళ్లారు. కానీ అక్కడ వాతావరణం అనుకూలించకపోడంతో మంచులో కూరుకుపోయి ఇద్దరూ మరణించారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

టెండరు ప్రకటన నం. 14 to 20-DRM_W_HYB, తేది: 06.06.2024

భారత రాష్ట్రపతి తరపున **డివిజినల్ రైల్వే మేనేజర్/పనులు, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్యరైల్వే, సికింద్రాబాద్** వారు దిగువ పనుల కొరకు **ఇ-ప్రొక్యూర్‌మెంట్** ద్వారా 28.06.2024న 15.00 గంటల వరకు ఓపెన్ టెండర్లు కోరుచున్నారు.

టెండరు నం. 14_DRM_W_HYB, **పని పేరు:** సికింద్రాబాద్-ముద్ఖేడ్ సెక్షన్: MOB-SIPT&AKE-MDAK సెక్షన్లు: MOB-SIPT & AKE-MDAK సెక్షన్ల పరిధిలో ఐసోలేటెడ్ లొకేషన్ల వద్ద సెస్ మరమ్మతు పనుల కొరకు ప్రతిపాదన. **సుమారు విలువ రూ:** 2,85,95,220/-, **బయానా రూ:** 2,93,000/-,

టెండరు నం. 15_DRM_W_HYB, **పని పేరు:** సికింద్రాబాద్-డోన్ సెక్షన్: (1) కాచిగూడ: ఆప్రాన్ రోడ్ నం. 3&4లో విరిగిన PSC స్లీపర్స్ రీప్లేస్‌మెంట్ మరియు పంపింగ్ స్లీపర్స్ గ్రౌటింగ్. (2) వంతెనలు మరియు అప్రోచ్‌లపై పాడైన స్లీపర్స్ రెన్యువల్. **సుమారు విలువ రూ:** 60,01,557/-, **బయానా రూ:** 1,20,000/-,

టెండరు నం. 16_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: సికింద్రాబాద్-డోన్ సెక్షన్: LC గేట్ల స్థానంలో నిర్మించిన వాటర్ లాగింగ్ RUBల నుండి వాన నీటిని తోడివేయుట. **సుమారు విలువ రూ:** 93,09,425/-, **బయానా రూ:** 1,86,200/-

టెండరు నం. 17_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: సికింద్రాబాద్ - 01.07.2024 నుండి 30.06.2025 వరకు కాలానికి ADEN/EI/HYB నియంత్రణ పరిధిలోని SSE/W/NLGD & SSE/W/RN అధికార పరిధిలో క్వార్టర్స్ మరియు సర్వీస్ భవనాల యొక్క వార్షిక మరమ్మతులు/ నిర్వహణ. **సుమారు విలువ రూ:** 2,71,70,835/-, **బయానా రూ:** 2,85,900/-

టెండరు నం. 18_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: సికింద్రాబాద్ - 01.07.2024 నుండి 30.06.2025 వరకు కాలానికి ADEN/EII/HYB నియంత్రణ పరిధిలోని SSE/W/GOC & SSE/W/WW/SC అధికార పరిధిలో క్వార్టర్స్ మరియు సర్వీస్ భవనాల యొక్క వార్షిక మరమ్మతులు/ నిర్వహణ. **సుమారు విలువ రూ:** 2,17,31,273/-, **బయానా రూ:** 2,58,700/-

టెండరు నం. 19_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: సికింద్రాబాద్ - 01.07.2024 నుండి 30.06.2025 వరకు కాలానికి ADEN/EII/HYB నియంత్రణ పరిధిలోని SSE/W/MLY, SSE/W/CKL & SSE/W/KCG అధికార పరిధిలో క్వార్టర్స్ మరియు సర్వీస్ భవనాల యొక్క వార్షిక మరమ్మతులు/ నిర్వహణ. **సుమారు విలువ రూ:** 5,64,05,420/-, **బయానా రూ:** 4,32,000/-

టెండరు నం. 20_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: సికింద్రాబాద్ - 01.07.2024 నుండి 30.06.2025 వరకు కాలానికి ADEN/EI/HYB నియంత్రణ పరిధిలోని SSE/SEC-I/SLGD, SSE/SEC-II/SLGD, SSE/W/IRISET, SSE/W/WW/SLGD & SSE/W/SLGD అధికార పరిధిలో క్వార్టర్స్ మరియు సర్వీస్ భవనాల యొక్క వార్షిక మరమ్మతులు/ నిర్వహణ. **సుమారు విలువ రూ:** 5,46,91,250/-, **బయానా రూ:** 4,23,500/-

తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ **www.ireps.gov.in** దర్శించండి.

డివిజినల్ రైల్వే మేనేజర్/ పనులు/హైదరాబాద్

A0693

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

విద్యాభివృద్ధి జరిగేనా?

- ఇంతవరకు ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వని ప్రభుత్వం
- కేసీఆర్ సర్కారు కార్యక్రమాలే కొనసాగింపు..
- బడిబాటను ప్రారంభించిన అధికారులు
- 19వ తేదీ వరకు కొనసాగింపు

గద్వాలటౌన్, జూన్ 7 : సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించి వారికి మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించి విద్యాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది.. ఇందుకోసం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేసింది.. విద్యార్థులను మంచి చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక చొరవ చూపింది.. మరి నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు విద్యకు.. విద్యార్థుల పౌష్టికాహారం అందించడం.. ఇతర రంగాల్లో రాణించేలా ఏవైనా చర్యలు తీసుకున్నారా అంటే ఏమీ లేవనే చెప్పాలి.. మరికొన్ని రోజుల్లో బడులు తెరుచుకోనున్నాయి.. కానీ ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు.. దీంతో సర్కారు విద్యాభివృద్ధికి కృషి చేస్తుందా.. లేదా అన్నది మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే..?

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను పెంచడమే లక్ష్యంగా రూపొందించిన బడిబాట కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కొనసాగనుంది. బడిమానేసిన, బడి బయట ఉన్న పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటారు. ఇందుకు గాను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూవిద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించనున్నారు.

బడిబాట షెడ్యుల్ ఇలా..

బడిబాట కార్యక్రమంలో భాగంగా 6వ తేదీన గ్రామీణ ఆర్గనైజర్లతో ప్రత్యేక సమావేశాలు, 7న ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను గుర్తిస్తారు. 8 నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీలను సందర్శించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. 11న గ్రామసభలు ఏర్పాటు చేస్తారు. సభలో 10 వరకు చేపట్టిన అంశాలపై చర్చ ఉంటుంది. 12న పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా పండుగ వాతావరణం కల్పిస్తూ విద్యార్థులకు స్వాగతం పలకనున్నారు. అలాగే ఏకరూప దుస్తుల పంపిణీ, సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారు. 13న తొలిమెట్టు, 14న పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం, 15న విలీన విద్య, బాలిక విద్యాదినోత్సవం, 18న మొక్కల పెంపకం, డిజిటల్ తరగుతులపై అవగాహన, 19న విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహిస్తారు.

గతేడాది ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 472 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాలు ఉన్నాయి. 2021-22 విద్యా సంవత్సరంలో 6,656 మంది విద్యార్థులు బడిలో చేశారు. 2022-23లో 5,100 మంది, 2023-24లో 4,850 మంది విద్యార్థులు చేరారు. ఈ విద్యార్థులు గత మూడు విద్యాసంవత్సరాల కంటే ఈ విద్యాసంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులను బడుల్లో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేశారు.

ధరూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళాసంఘాలతో కలిసి బడిబాట ప్రారంభిస్తున్న అధికారి

ప్రభుత్వ స్పందన ఏదీ..?

మరో ఐదు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. కాగా విద్యాభివృద్ధికి గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలే తప్పా ప్రస్తుత ప్రభుత్వం నూతనంగా ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేసిన దాఖలాలు లేవు. విద్యాభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించలేదు. దీంతో గత ప్రభుత్వం మాదిరి విద్యాభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వ కట్టుబడి ఉంటుందా అన్న అనుమానాలు విద్యావంతులు వ్యక్తం చేస్తున్నారు. విద్యా వ్యవస్థను కాంగ్రెస్ పట్టించుకోదన్న ఆరోపణలు ఉన్నాయి. మరి ఆ ఆరోపణలే ఈ ప్రభుత్వం మూటకట్టుకుంటుందా లేక విద్యాభివృద్ధికి కట్టుబడి ఉండి మేము కూడా మారాం, విద్యాభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నది ప్రస్తుత ప్రభుత్వం ముందున్న లక్ష్యం.

భారీ వర్షాలకు కూలిన పూరి గుడిసె

లింగాల, జూన్ 7 : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలకేంద్రంలోని ఒకటో వార్డులో శుక్రవారం ఈశ్వరయ్యకు చెందిన పూరి గుడిసె కూలిపోయింది. గురువారం రాత్రి ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు గుడిసెలో నిద్రిస్తున్న సమయంలో పూరి గుడిసె ఒక్కసారిగా కూలిపోయినట్లు తెలిపారు. అందరూ వెంటనే బయటకు రావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధం

మహబూబ్‌నగర్, జూన్ 7 : షార్ట్‌సర్క్యూట్‌తో జిల్లా కేంద్రంలోని అశోక్ థియేటర్ సమీపంలోని సాయి రెగ్జిన్ దుకాణంలో శుక్రవారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అలాగే పక్క దుకాణాలకు సైతం మంటలు వ్యాపించడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కిశోర్, సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఊట్కూర్, జూన్ 7 : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని పులిమామిడిలో చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. బండ్రపల్లికి చెందిన లక్ష్మి(30)కి తొమ్మిదేండ్ల కిందట పులిమామిడి గ్రామానికి చెందిన రవితో వివాహమైంది. కొన్నాళ్ల తర్వాత లక్ష్మిపై అత్తింటి వేధింపులు అధికం కావడంతో పలుమార్లు గ్రామ పెద్దలు సర్దిచెప్పారు. అయినా తీరుమారకపోవడంతో ఈనెల 5న లక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. లక్ష్మి సోదరుడు శ్రీనివాస్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్ గేదె మృతి

వెల్దండ, జూన్7: మండల పరిధిలోని కొట్ర గ్రామంలో పోనుగోటి నవీన్‌రావు అనే రైతుకు చెందిన గేదె శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో పశువులు మేస్తుండగా అక్కడ ఉన్న విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు నవీన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

డీసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, జూన్ 7 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్ష రాయడానికి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో అర్హత కలిగిన అభ్యర్థులు డీసెట్-2024 ద్వారా రెండేండ్ల విద్యనభ్యసించేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మేరాజుల్లాఖాన్ తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు http://deecet.cdse. telangana. gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

బెల్లం పట్టివేత

కల్వకుర్తి, జూన్ 7 : రూ.3లక్షల విలువ గల బెల్లం, 40 కిలోల ఆలం పట్టుబడిన ఘటన శుక్రవారం కల్వకుర్తి మం డలంలో చోటు చేసుకున్నది.కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు హైదరాబాద్ గంజ్ మార్కెట్ నుంచి ఓ కారులో 12 బ్యాగులలో బెల్లం, 40 కిలోల ఆలం, నాలుగు లీటర్ల సారా ను అక్రమంగా తరలిస్తుండగా కల్వకుర్తి మున్సిపల్ పరిధిలో తనిఖీలో భాగంగా కుర్మిద్ద క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వాహనాన్ని అదుపులోకి తీసుకొని కల్వకుర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుబడిన బెల్లం విలువ దాదాపు రూ.3లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై కొత్తపల్లి తండాకు చెందిన కాట్రావత్ రవి, వెంకటాపూర్ తం డాకు చెందిన జగన్ నాయక్‌లపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టుబడిన బెల్లం వాహనం కల్వకుర్తి మండలం వెం కటాపూర్ తండాకు వెళ్తున్నట్లు తమ విచారణలో తెలిందని సీఐ పేర్కొన్నారు. బెల్లం అక్రమంగా సరఫరా చేసినా, నాటు సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చ రించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది మహేశ్, నార్య, రఘు, భిక్షపతి పాల్గొన్నారు.

మంటగలిసిన మానవత్వం

- ఆస్తి కోసం తండ్రిని గెంటేసిన కుమార్తెలు
- తీవ్ర అస్వస్థతకు గురై మృతి

కల్వకుర్తి రూరల్, జూన్ 7 : మానవత్వం మంటగలుస్తున్నది. సభ్యసమాజం సిగ్గుపడేలా ఆస్తి కోసం కన్న తండ్రిని కుమార్తెలు ఇంటి నుంచి గెంటేయడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకున్నది. కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రాంనగర్‌కు చెందిన శ్రీహరి (65) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండేవాడు. అతడికి నలుగురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహం జరిగింది. అయితే, ఇటీవల శ్రీహరి కిడ్నీల వ్యాధికి గురికావడంతో హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నాడు. అనంతరం కల్వకుర్తికి వచ్చి స్థానికంగా ఉన్న ఆలయాల్లో జీవించసాగాడు. ఈ క్రమంలో తల్లిదండ్రుల నుంచి శ్రీహరికి వచ్చిన ప్లాట్‌ను నలుగురు కుమార్తెల పేరిట చేయాలని డిమాండ్ చేయడంతో ఆయన అంగీకరించలేదు. దీంతో గురువారం ఉదయం శ్రీహరిని కల్వకుర్తిలోని సాయిబాలాజీ ఫంక్షన్‌హాల్ వద్ద కుమార్తెలు వదిలి వెళ్లిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీహరి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఒంటరిగా వదిలివేయడంతోనే మనస్థాపానికి గురై మృతి చెంది ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. శ్రీహరి మృతదేహానికి కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు నివాళులర్పించారు.



శ్రీహరి (ఫైల్)

కిరాణషాపు యజమానికి టోకరావేసిన యువకుడు



సీసీ పుటేజీలో రికార్డు అయిన యువకుడి ఫోటో

వడ్డేపల్లి, జూన్ 7 : కిరాణషాపులో సరుకులు కావాలని లిస్ట్ ఇచ్చి అంతలోపే వేరేచోట డబ్బులు కట్టాలని వారివద్ద నగదు తీసుకొని ఉడాయించిన ఘటన శాంతి నగర్‌లో చోటు చేసుకున్నది. బాధితులు కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం11 గంటలు సమయంలో రాఘవేంద్ర కిరాణ షాపువద్దకు ఒక యువకుడు వచ్చి ఇంట్లో ఫంక్షన్ ఉంది సరుకులు కట్టాలని షాపు యజమాని రాఘవేంద్రరావుకు లిస్టు ఇచ్చాడు. సరుకులు కట్టండి డబ్బులు మా నాన్న నాకు ఫోన్‌పే చేస్తాడు ఇస్తానని నమ్మబలికాడు. మీరు సరుకులు కట్టేలోగా చికెన్‌షాపు వద్ద రూ. 5,500 కట్టాలి, మీరు ఇస్తే కట్టివచ్చి మొత్తం కలిపి మీకు ఇస్తానని నమ్మించి వారి వద్ద డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత ఒక 20నిమిషాలు షాపు ఎదుట కూర్చొని ఉన్నట్లు నటించి అక్కడి నుంచి నగదు తీసుకొని జారుకున్నాడు. ఆ యువకుడు ఎంతసేపటికీ రాకపోవడంతో మోసపోయామని షాపు యజమాని గ్రహించి సీసీ కెమెరాల్లో అతని ఫొటోలను తీసుకొని శాంతినగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ విచిత్రమేమిటంటే కాంగ్రెస్ పార్టీవారి ఊరేగింపు సంబురాల కోసం వచ్చిన జనం, పోలీసులు ఆ సమయంలో వారి షాపు ఎదుటే ఉన్నారు. అందరూ ఉన్నా అందరి కళ్లు గప్పిన మోసగాడి ఆచూకీ తెలపాలని కోరుతున్నారు.

రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి

డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ సభ్యులు

పాలమూరు, జూన్ 7 : ఇంటర్ మూల్యాంకనంలో పాల్గొన్న సిబ్బందికి రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో డీఐఈవో శ్రీధర్‌సుమన్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష మూ ల్యాంకనం కోసం వేలాది మంది అధ్యాపకులు, అధికారులు ఇతర సిబ్బంది పాల్గొంటారు. రెండేండ్ల కిందట ఇంటర్ పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేయగా, వాటికి సంబంధించి రెమ్యునరేషన్ కూడా ఇప్పటి వరకు విధుల్లో పాల్గొన్న అధ్యాపకులకు ఇవ్వలేదన్నారు. దీనిపై డీఐఈవో స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.